మెరుగైన వైద్య సేవల కోసం శిక్షణ తరగతులు

బీసీఎంఈ శిక్షణ తరగతులో రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, అబ్జర్వర్ డాక్టర్ ఆశిష్

ఎదులాపురం, నవంబర్ 7 : మెరుగైన వైద్యసేవల కోసం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ తెలిపారు. మూడు రోజుల నుంచి రిమ్స్ మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో బీసీఎంఈ (బేసిక్ బోర్డ్ మెడికల్ ఎడ్యుకేషన్) శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. గురువారంతో ఈ శిక్షణ తరగుతులు ముగిశాయి. మహారాష్ట్ర వార్ధాలోని జవహర్ లాల్ నెహ్రూ మెడికల్ కాలేజ్ నుంచి హాజరైన అబ్జర్వర్ డాక్టర్ ఆశిష్ సూచనల మేరకు ప్రొఫెసర్లు శిక్షణను ఇచ్చారు. మారుతున్న ఆధునాతన వైద్య విధానాలతో వైద్యం అందించే తీరుపై శిక్షణ తరగతులు కొనసాగాయి. ఈ శిక్షణ తరగతులో వైద్యులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పరామర్శిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

బోథ్, నవంబర్ 7: సొనాల గ్రామానికి చెందిన అబ్దుల్ సత్తార్ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను గురువారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పరామర్శిస్తున్న భూక్యా జాన్సన్ నాయక్

ఖానాపూర్ రూరల్, నవంబర్ 7: ఖానాపూర్ మండలం గొసంపల్లె, ఏల్లాపూర్, గోడలపంపు గ్రామాలకు చెందిన కట్ల రాజమల్లు తండ్రి, కృష్ణ తండ్రి, బీఆర్ఎస్‌కు చెందిన భూక్యా కిషన్ సతీమణి శిలాబాయి ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను గురువారం బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ధర్మ రాజు, శ్రీనివాస్, శ్రావణ్, శేఖర్ ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ముథోల్, నవంబర్7 : మండలంలోని రువ్వి, ఆష్టా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్ ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్ గౌడ్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డును అనుకునే చేపట్టిన లోగో నిర్మాణం

లోగో నిర్మించారు.. నిబంధనలు మరిచారు..

ఖానాపూర్ టౌన్, నవంబర్ 7: ఖానాపూర్–తర్లపాడ్ రహదారిలో ఎన్టీఆర్ చౌరస్తా వద్ద గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన మున్సిపల్ పార్కు ఎదుట ప్రస్తుత మున్సిపల్ పాలకవర్గం ఐలవ్ఎంసీకే పేరిట ఒక లోగోను నిర్మించింది. ఆర్అండ్‌బీ శాఖ నిబంధనల ప్రకారం రోడ్డు మధ్య నుంచి ఇరువైపుల 33 ఫీట్ల చొప్పున స్థలం వదిలేసి నిర్మాణాలు చేపట్టాలి. కానీ రోడ్డును అనుకుని పార్కు ఎదుట ఐలవ్ఎంసీకే పేరిట లోగోను ఏర్పాటు చేశారు. ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఇలాంటి నిర్మాణాల వల్ల మరింత ఇబ్బందులు పడే అవకాశం ఉందని పలువురు విమర్శిస్తున్నారు. లోగో నిర్మాణం పార్కు లోపల చేసి ఉంటే బాగుంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించాలి

నిర్మల్ అర్బన్, నవంబర్ 7 : నిర్మల్ జిల్లాలో హోటల్, రెస్టారెంట్, కిరాణ దుకాణం, సూపర్ మార్కెట్ వ్యాపారాలు నిర్వహించే వ్యాపారస్తులు ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తూ తమ వ్యాపారాలను నిర్వహించుకోవాలని ఫుడ్ సేఫ్టీ అదికారి ప్రత్యూష అన్నారు. గురువారం పట్టణంలోని మయూరి హోటల్‌లో కిరాణ దుకాణాలు, సూపర్ మార్కెట్, హోటల్ రెస్టారెంట్ యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఫుడ్ లైసెన్స్ తీసుకోవాలని కలర్స్, నాసిరకం వస్తువులతో వంటకాలు, నిషేధిత పదార్థాలను వాడవద్దని, పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే దుకాణాలు సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ పాల్గొన్నారు.

నిర్మల్‌లో గ్రిల్ 9 హోటల్ సీజ్

నిర్మల్‌లోని శాస్త్రినగర్ కాలనీలో గల గ్రిల్ 9 హోటల్‌ను గురువారం ఫుడ్ సేఫ్టీ అధికారిణి ప్రత్యూష సీజ్ చేశారు. ఈనెల 2, 3వ తేదీల్లో ఈ హోటల్‌లో భోజనం చేసిన పలువురికి ఫుడ్ పాయిజన్ అయిన విషయం విదితమే. ఇందులో 50 మంది తీవ్ర అస్వస్థతకు గురికాగా.. ఒకరు మృతి చెందారు. ఈ ఘటలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హోటల్‌లో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌తో కలిసి తనిఖీలు నిర్వహించారు. వంట గదిని, హోటల్‌లో వస్తువులను తయారు చేసేందుకు ఉపయోగించే ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. కాలం చెల్లిన పదార్థాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. హోటల్‌లో అపరిశుభ్ర వాతావరణం, ఫుడ్ పాయిజన్ కావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. హోటల్‌లో వాడే పదార్థాలు సీసీ పుటేజ్‌లో నమోదు కావడంతో ఎక్కడ దొరికి పొతామోనని హార్డ్ డిస్క్‌ను మాయం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యూష మాట్లాడుతూ.. హోటల్‌కు లైసెన్స్ లేదని లైసెన్స్ గడువు ముగిసినా రెన్యువల్ చేసుకోలేదని అన్నారు. ప్రభుత్వం నిషేధించిన మైనీస్‌ను వాడుతున్నారని, ఈ కారణంతోనే ఫుడ్ పాయిజన్ అయి ఒకరు చనిపోవడం జరిగి ఉండొచ్చని తెలిపారు. ఈ తనిఖీల్లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవీదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పౌరసేవ ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ పూర్తి చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 7 : పౌరసేవల ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తు పత్రాలను వెంటనే పరిశీలించాలని తెలిపారు. మండలాల వారిగా పెండింగ్‌లో ఉన్న పౌరసేవల గుర్తింపు పత్రాల దరఖాస్తుల వివరాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. మండలాలకు సంబంధించిన పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయాలల్లో సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు తనిఖీ చేయాలన్నారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాలు అందజేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, కార్యాలయ పర్యవేక్షకుడు సూర్యారావు, ఈడీఎం నదీమ్, అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తూనికలు కొలతల శాఖ అధికారుల తనిఖీలు

భైంసా: తనిఖీలు చేస్తున్న అధికారులు

భైంసా, నవంబర్ 7 : భైంసాలో తూనికల కొలతల శాఖ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. తూనికల కొలతల శాఖ కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ విజయ సారథి మాట్లాడుతూ కాంటాలను సరిచేసే కాంట్రాక్టర్ కాంటాల పని పూర్తి చేయకపోవడంతో ఇప్పటి వరకు స్టాంపింగ్ కాలేదన్నారు. వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాపారుల వద్ద కొనుగోలు చేసే వినియోగదారులకు సైతం తూకాల్లో నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత సైతం తమదేనన్నారు. వారం, పది రోజుల్లో కాంటాలను సరిచేసి స్టాంపింగ్ అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట తూనికల కొలతల శాఖ జిల్లా ఇన్‌చార్జి భూలక్ష్మి, సిబ్బంది, ఉన్నారు.

ముథోల్, నవంబర్ 7 : ముథోల్‌లోని పలు దుకాణాల్లో తూనికల కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. కరీంనగర్ జోనల్ అధికారి విజయసారథి, జిల్లా అధికారి భూలక్ష్మి కిరాణం, స్వీట్‌హోం తదితర దుకాణాల్లో డిజిటల్ తుకాలు, బాట్లు పరిశీలించారు. నాలుగు షాపుల్లో తుకాలు తేడ రాగా వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎంలు

ఎదులాపురం, నవంబర్ 7 : గిరిజన సంక్షేమ శాఖలోని ఆశ్రమ పాఠశాలల్లో, పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్‌లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎంలకు పెండింగ్‌లో ఉన్న తొమ్మిది నెలల వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. గురువారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదట ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలు చిన్నపిల్లలను ఎత్తుకొని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎంలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వేతనాలలో పీఎఫ్, ఇఎస్ఐల కటింగ్ విషయంలో సరైన సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల స్వామి, ఏఎన్ఎం యూనియన్ నాయకులు కమల, కామేశ్వరి, జంగుబాయి, శ్యామ్ పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

ముథోల్, నవంబర్ 7 : మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ విజయ్ కిరణ్‌కర్ అన్నారు. గురువారం ముథోల్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో మత్స్యకారులకు చేప పిల్లలను ఎంపీడీవో శివకుమార్‌తో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం సభ్యులు, ఫీల్డ్‌మెన్ రాజేందర్ పాల్గొన్నారు.

12న కార్తీక దీపోత్సవం

ఎదులాపురం, నవంబర్ 7 : కార్తీక ఏకాదశి సందర్భంగా సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాల మైదానంలో ఈ నెల 12వ తేదీన కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మఠాధిపతి యోగానంద సరస్వతి తెలిపారు. గురువారం స్థానిక గోపాలకృష్ణ మఠంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్తీక దీపోత్సవం వాల్ పోస్టర్‌ను సమితి సభ్యులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, గౌరవాధ్యక్షుడు వామన్, ఉపాధ్యక్షులు రవీందర్, సంతోష్, నర్సింహులు, సుంజీవ్, విజయ్, స్వామి, వేణు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక సర్వే పనులు నిలిపి వేయాలి

బోథ్, నవంబర్ 7 : కుచులాపుర్ గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో సాయినగర్ వాసులు తల పెట్టిన శ్మశాన వాటిక సర్వే పనులు వెంటనే నిలిపి వేయాలని గ్రామస్తులు తహసీల్దార్ సుభాష్ చందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఇక్కడ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సోము భోజారెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రమోహన్, మల్లయ్య, సిరిపురం దాసు, స్వామి, నారాయణ రెడ్డి, రమేష్, దత్తు, నారాయణ ఉన్నారు.

టీయూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

బోథ్, నవంబర్ 7: ఆదిలాబాద్‌లోని టీటీడీలో ఈ నెల 10వ తేదీన నిర్వహిస్తున్న టీయూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మండల ప్రధాన కార్యదర్శి బైరి సతీశ్‌కుమార్ పిలుపు నిచ్చారు. గురువారం బోథ్ జడ్పీఎస్ఎస్ పాఠశాలలో మహాసభలకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ పోశెట్టి, టీయూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు రఘుపతి, ప్రధానోపాధ్యాయుడు శశిధర్ రెడ్డి, అధ్యక్షుడు అప్పాల శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలికంగా సోయాబీన్ కొనుగోలు నిలివేత

ఇచ్చోడ, నవంబర్ 7: ఇచ్చోడ ఏఎంసీలో సోయాబీన్ నిల్వలు ఉండడం వలన ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు కొనుగోలు నిలిపివేస్తున్నట్లు గోదాం ఇన్‌చార్జి ఈశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి యథావిధిగా కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

నార్నూర్, నవంబర్ 7 : వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి రాంబాబు వైద్య సిబ్బందికి సూచించారు. నార్నూర్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సమావేశంలో వైద్య సిబ్బంది లక్ష్మి, చరణ్‌దాస్, గణేశ్‌కుమారి, విలాస్, హిమబిందు, ప్రియాంక, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

గౌడ జన హక్కుల పోరాట సమితి కార్యవర్గం

నిర్మల్ అర్బన్, నవంబర్ 7 : గౌడ జన హక్కుల పోరాట సమితి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా కనక గౌడ్, అధ్యక్షుడిగా గోపి గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా ప్రకాశ్, పాకాల చంద్ర శేఖర్, ఉపాధ్యక్షులుగా దశగౌడ్, శరత్ గౌడ్, సంతోష్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, రవీందర్, కార్యదర్శులుగా నాగభూషణ్, వెంకటేశ్, శ్రీనివాస్, కోశాధికారిగా రమేశ్, అధికార ప్రతినిధిగా మురళి, నిఖిల్, రాజు, ప్రచార కార్యదర్శిగా అశోక్, శ్రీనివాస్, సురేందర్, న్యాయసలహాదారులు రమణ, గౌరవ సలహాదారులుగా నర్సాగౌడ్, రమణ, శంకర్ ఎన్నికయ్యారు.

క్యాన్సర్ రోగికి ఆర్థిక సాయం

కుభీర్, నవంబర్ 7: కుభీర్‌కు చెందిన తోకల రమేశ్ క్యాన్సర్ వ్యాధి బారిన పడి ఆర్థికంగా చిక్కిపోయాడు. స్థానిక యువతరంగ్ యూత్ ఆధ్వర్యంలో గురువారం రూ.12వేల ఆర్థిక సాయం ఆయనకు అందజేశారు. ఇక్కడ యోగేవ్, నిఖిల్, సతీశ్, మహేశ్, కరేశ్, పండరి, ప్రసాద్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ పరీక్ష

పెంబి, నవంబర్ 7: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు చెకుముకి టాలెంట్ పరీక్షను నిర్వహించినట్లు ఎంఈవో రాంచందర్ తెలిపారు. పదో తరగతిలో అక్షిత్, తొమ్మిదో తరగతిలో శ్రీజ, ఎనిమిదో తరగతిలో వైశాలీలు మొదటి స్థానంలో నిలిచారు. వీరు ఈ నెల 21వ తేదీన నిర్వహించే మండల స్థాయిలో పాల్గొని పరీక్షలు రాయనున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతి, సాయన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్టీ యూనియన్ యువజన విభాగం అధ్యక్షుడిగా అంకుశ్

కుభీర్, నవంబర్ 7: తెలంగాణ రాష్ట్ర ఎస్టీ యూనియన్ యువజన విభాగం అధ్యక్షుడిగా కుభీర్ మండలం వీరేగావ్ గ్రామానికి చెందిన జాదవ్ అంకుశ్ ఎన్నికయ్యారు. తనపై నమ్మకముంచి బాధ్యతలు అప్పగించిన ఈ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు హైకోర్టు న్యాయవాది దేవదాస్‌తో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులకు అంకుశ్ కృతజ్ఞతలు తెలిపారు.

బోథ్ విద్యాధికారిగా పోశెట్టి

బోథ్, నవంబర్ 7: బోథ్ మండల విద్యాధికారిగా కుమ్మరి పోశెట్టి నియమితులయ్యారు. గురువారం విద్యా శాఖ డైరెక్టరేట్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం ఆయన బోథ్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పీజీ హెచ్ఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఎం ఈవోగా పని చేసిన ఇదపు పోశెట్టి ఇటీవల ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో పోశెట్టిని నియమించారు.

ఆలయానికి మకర తోరణం బహూకరణ

జైనథ్, నవంబర్ 7: జైనథ్‌లోని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో గురువారం ఆదిలాబాద్‌కు చెందిన గుండల్వార్ నారాయణ స్వామి ఊర్మిళ దంపతులు స్వామి వారికి మకర తోరణం బహూకరించారు. 13 కిలోల వెండితో రూ.15 లక్షల విలువ గల మకర తోరణం చేయించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ అడ్డి రుకేశ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్ రెడ్డి, ఆలయ అర్చకులు వెంకట రమణాచారి, దప్పర్ ధీరజ్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యర్థుల సర్టిఫికెట్లు రీ వెరిఫికేషన్ చేయాలి

బేల, నవంబర్ 7: మరాఠి మీడియంలో నకిలీ సర్టిఫికెట్స్‌తో డీఎస్సీ ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల సర్టిఫికెట్లను రీ వెరిఫికేషన్ చేపట్టి నిరుద్యోగులకు న్యాయం చేయాలని మండల మరాఠి మీడియం డీఎస్సీ అభ్యర్థులు డిమాండ్ చేశారు. గురువారం బేలలోని గ్రంథాలయంలో డీఎస్సీ అభ్యర్థులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసలు లోకల్ అభ్యర్థులను కాకుండా నాన్ లోకల్ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిగణలోకి తీసుకొని హడావుడిగా పోస్టింగ్‌లు ఇచ్చారని ఆరోపించారు. కలెక్టర్ చొరవ తీసుకొని మరాఠి మీడియంలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల సర్టిఫికెట్లను రీ వెరిఫికేషన్ చేపట్టాలని కోరారు. అదేవిధంగా మరాఠి మీడియంలో తప్పుడు వెరిఫికేషన్ చేసిన అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల మరాఠి మీడియం డీఎస్సీ అభ్యర్థులు సూరజ్ అంకుష్, అవినాశ్, ప్రమోద్, అతుల్, రాందాస్, రాజు, ఆకాశ్, హర్షల్, వికాస్, దత్త, అమోల్, అంకుశ్‌ఖడే పాల్గొన్నారు.

దుబ్బగూడలో రేషన్ షాపు ప్రారంభం

బేల, నవంబర్ 7: దుబ్బగూడ గ్రామంలో రేషన్ షాపును గురువారం కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ సామ రూపేశ్ రెడ్డి ప్రారంభించారు. నాయకులు పాల్గొన్నారు.

చెకుముకి పరీక్షను సద్వినియోగం చేసుకోండి

ఎదులాపురం, నవంబర్ 7 : చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో ప్రణీత అన్నారు. పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పరీక్ష పేపర్‌ను గురువారం ఆదిలాబాద్‌లో డీఈవో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం కోసం జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషిలో భాగంగా విద్యార్థి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల 21వ తేదీన మండల స్థాయిలో, 28వ తేదీన జిల్లా స్థాయిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర స్థాయి డిసెంబర్ 14, 15, 16 తేదీల్లో ఆదిలాబాద్‌లో నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఆర్వో తిరుమల, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, లిటిల్ ఫ్లవర్ స్కూల్ ప్రిన్సిపాల్ దేవేందర్ పటాస్కర్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నూతుల రవీందర్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉమాకాంత్, పెంటపర్తి ఊశన్న, జిల్లా నాయకులు బాబన్న, మెస్రం రాజు పాల్గొన్నారు

చెకుముకి సైన్స్ పరీక్షలు

నర్సాపూర్(జీ), నవంబర్ 7: గొల్లమాడ ఉన్నత పాఠశాలలో నిర్మల్ జిల్లా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో అత్యధికంగా మార్కులు సాధించిన 8, 9, 10 తరగతుల నుంచి ఒక్కొక్క విద్యార్థి ఈ నెల 21న జరిగే మండల స్థాయి పరీక్షకు హాజరవుతారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోయాబీన్ వెంటనే ఎగుమతి చేయాలి

ఇచ్చోడ, నవంబర్ 7 : రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన సోయాబీన్‌ను సత్వరమే లారీల ద్వారా ఎగుమతి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి అన్నారు. గురువారం ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కేంద్రాన్ని సందర్శించారు. రైతులు నాణ్యమైన సోయాబీన్ తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. అధికారులు రైతులకు ఇబ్బందులు కల్గకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట ఏఎంసీ రాజు, ఏఈవో సంజీవ్, ఆత్మ మాజీ చైర్మన్ రామన్న ఉన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

ఖానాపూర్ రూరల్, నవంబర్ 7: మస్కాపూర్ గ్రామంలోని మసీదులో సీఐ సైదారావు సీసీ కెమెరాలను ప్రారంభించారు. మసీదు కమిటీ ఆధ్వర్యంలో నాలుగు సీసీ కెమెరాలను అమర్చారు. కార్యక్రమంలో ఎస్ఐ రాహుల్ గైక్వాడ్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలను తగ్గించాలి

దస్తురాబాద్, నవంబర్ 7: కడెం మండల పరిధిలో సైబర్ నేరాల కేసులు తగ్గించేందుకు పోలీసులు కృషి చేయాలని డీఎస్పీ గంగారెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా సందర్శించారు. ఠాణాకు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతయుతంగా వ్యవహరించాలని అన్నారు. ఇటీవల నమోదైన యూఐ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణ దిశగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

రైతుల పక్షాన నిరసనలు చేస్తాం

జైనథ్, నవంబర్ 7: జిల్లాలోని వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని తేమశాతం నిబంధనలు లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని కోరుతూ సోయాబీన్ డబ్బులు త్వరగా రైతులకు పడేలా చూడాలని మాజీ ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ డిమాండ్ చేశారు. పత్తి కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గురువారం జైనథ్ మార్కెట్ యార్డును బీఆర్ఎస్ మండల నాయకులు సందర్శించారు. అనంతరం మార్కెట్ యార్డులో సోయా కొనుగోళ్ల ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పత్తి మద్దతు ధర విషయంలో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని అన్నారు. అలాగే యాసంగి పంటకు సైతం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి మద్దతు లేక రైతుల ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. పెట్టుబడి ఖర్చులకు, మద్దతు ధరకు పొంతన ఉండడం లేదన్నారు. జిల్లాలో భిన్నమైన వాతావరణ పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా దేశ వ్యాప్తంగా ఒకే రకమైన తేమ నిబంధనలను విధించడం ఎంత మేరకు సమంజసమని ప్రశ్నించారు. రైతుల సమస్యలపై ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్న ధర్నాకు రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు లింగారెడ్డి పుంద్రు, వెంకట్ రెడ్డి, గణేశ్ యాదవ్, ప్రభాకర్, జక్కుల అడెల్లు, రైతులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

ఇంద్రవెల్లి, నవంబర్ 7 : ఏమాయికుంట గ్రామానికి చెందిన పవార్ దత్తా ఇంట్లో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.20 వేలు నగదు, 15 తులాల వెండి పట్టీలు దొంగలించారు. ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

ఇసుక డంపులు సీజ్

ఖానాపూర్ టౌన్, నవంబర్ 7 : ఖానాపూర్ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన 10 ఇసుక డంపులను మైనింగ్ అధికారులతో కలిసి నిర్మల్ ఆర్డీవో రత్నాకళ్యాణి సీజ్ చేశారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హెచ్చరించారు. తహసీల్దార్ శివరాజ్, మైనింగ్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, డీటీ మంజుల, అధికారులు పాల్గొన్నారు.

స్వప్న దవాఖానలో అరుదైన ఆపరేషన్

మహిళ మూత్ర సంచిలో నుంచి తొలగించిన రాయి

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 7: హైదరాబాద్ కార్పొరేట్ స్థాయిలో చేసే ఆపరేషన్ నిర్మల్‌లోని స్వప్న దవాఖానలో వైద్యులు అరుదైన ఆపరేషన్ చేశారు. వివరాలకు వెళ్లితే.. ఖానాపూర్‌కు చెందిన నర్సవ్వ మూత్ర సంచిలో రాయి ఉండడంతో మూత్ర నాళాలతో తీవ్ర నొప్పితో బాధపడుతోంది. పలు దవాఖానలకు వెళ్లినా వ్యాధి నయం కాకపోవడంతో నిర్మల్‌లోని స్వప్న దవాఖానకు వచ్చారు. వైద్యులు అన్ని పరీక్షల